## (జువ్వలపాలెంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 22-5-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన జీవితగమ్యం మోక్షం. నిష్కామకర్మ చేయటం వలన చిత్తశుద్ది కలుగుతుంది, చిత్తశుద్ది వలన జ్ఞానం కలుగుతుంది, జ్ఞానం వలన మోక్షం కలుగుతుంది. ధ్యానం చేసి అజ్ఞానం అనే మట్టిని తీసివేస్తే మన హృదయంలో ఉన్న జ్ఞానగంగ మనకు కనిపిస్తుంది. గుణాతీతస్థితికి వెళ్ళే వరకు కర్మ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఇది విధి, ఇది నిషేదం అని పెట్టుకోవాలి. చేయకూడని పని చేయకూడదు, చేయవలసిన పని మానకూడదు. చేతులతో మంచి పనులు చేస్తూఉంటే, నోటితో మంచి మాటలు మాట్లాడుతూ ఉంటే, మనస్సులోనికి మంచి తలంపులు, ఆలోచనలు వచ్చేటట్లు చూసుకోంటే మనం పవిత్రులము అవుతాము. మనము పవిత్రులమయినపుడు మన హృదయంలో ఉన్న జ్ఞానగంగ మన చేతికి అందుతుంది. పరమేశ్వరునియందు భక్తి విడిచిపెట్టకూడదు. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా, సత్పురుషులను ఆశ్రయించి, జ్ఞానులను ఆశ్రయించి మోక్షం అనే మన గమ్యమును చేరుకోవాలి.

గాయత్రీ మంత్రంను మీరు అందరు ధ్యానం చేయవచ్చు. దాని అర్ధమును మీరు పట్టించుకోవాలి. వివేకమును, బాగుపడే బుద్ధిని కలుగజేయమనిదాని అర్ధం. నీ బుద్ధి బాగుపడితే నీవు బాగుపడటం ఎంతసేపు అన్నారు భగవాన్. నీబుద్ధి బాగుపడాలి అంటే గాయత్రీ మంత్రం చేయాలి. గాయత్రీ మంత్రం వలన మంచి బుద్ధి కలుగుతుంది. మనం బుద్ధిని, వివేకమును కాపాడుకోంటే బ్రహ్మవిద్య గురించి వినటానికి సరిపోతాము. తరువాత మననం మాట అటు ఉంచండి బుద్ధి సరిగా లేకపోతే అసలు శ్రవణానికే సరిపోము. వైరాగ్యం లేని మనిషి, జిజ్ఞాసలేని మనిషి బ్రహ్మ విద్య గురించి వినటానికి పనికిరాడు. మోక్ష స్థితి, జ్ఞానగంగ మన హృదయంలోనే ఉంది అనే నిశ్చయానికి రావాలి. ఎవడి బుద్ధి అయితే బాగుపడిందో వాడికి జ్ఞాన గంగ ఎక్కడోలేదు మన హృదయంలోనే ఉంది అనే నిశ్చయం కలుగుతుంది. నిశ్చయం కలిగిన తరువాత లోపల ఉన్న జ్ఞానగంగను పొందటానికి ప్రయత్నం చేస్తాడు. హృదయంలో ఉంది అని తెలిస్తే ప్రయత్నం చేస్తాడు గాని అది తెలియనివాడు అసలు ప్రయత్నమే చేయడు. మనలను సత్యం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి మహాత్ములు, అవతార పురుషులు ఈభూమి మీదకు వస్తారు. దీపం ఆరిపోతూ ఉంటే మనం నూనె పోస్తాము అలాగే జ్ఞానదీపం ఆరిపోతూ ఉంటే మహాత్ములు, జ్ఞానులు ఇక్కడకు వచ్చి జ్ఞానదీపం ఆరిపోకుండా కొంత నూనె పోస్తారు. వారికి సొంత పనులు అంటూ ఏమీ ఉండవు, లోక కళ్యాణమే.

నరకానికి వెళ్ళటానికి కామం, క్రోధం, లోభం అనే మూడు గేట్లు పెట్టాడు. నరకానికి వెళ్ళే ఈ మూడు ద్వారముల నుండి బయటకు రాకుండా నేను జ్ఞానమును సంపాదించాను, ఋషిని అయిపోయాను అనుకొంటావు ఏమిటి పిచ్చివాడా అంటున్నాడు భగవంతుడు, ఈ మూడింటిలో ఏఒక్కటి ఉన్నా చాలు నీవు నరకానికి వెళతావు. ఈ మూడింటిలో నుండి నీవు బయటకు వస్తే కదా నీ మనస్సు కుదురుపడేది, నీవు సాధన చేసేది. జ్ఞానగంగ నీ హృదయంలోనే ఉంది. అది మనకు తెలియటం లేదు. అజ్ఞానం అనే మట్టి మనకు అడ్డువస్తోంది. జ్ఞాన గంగను పొందటానికి ఏ అజ్ఞానం అయితే అడ్డువస్తోందో అదే నీ శత్రువు, అందువలన అజ్ఞానం అనే మట్టిని తొలగించాలి అనే బుద్ధి నీకు కలగాలి. అటువంటి మంచి బుద్ధి కలగాలి అంటే గాయత్రీమంత్రం చేయాలి.

మాకు భయం వేస్తోంది అని చాలామంది భక్తులు చెపుతూఉంటారు, భయం నుండి బయటికి రావాలంటే రెండు విషయాలు గుర్తుపెట్టుకోండి. భవిష్యత్ గురించి ఊహించుకోవటం మానివేయండి, జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం మానివేయండి ఈక్షణంలో భయం నుండి బయటకు వచ్చేస్తారు. భయం నుండి బయటకు వచ్చేస్తే దు:ఖం చల్లారి పోతుంది. భయంవలన మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యంచెడిపోతాయి. మానసిక ఆరోగ్యం, శారీరక ఆరోగ్యములను జాగ్రత్తగా కాపాడుకోవాలి ఎందుచేతనంటే నీహృదయంలో ఉన్న జ్ఞానగంగను తెలుసుకోవటానికి ఇవి రెండూ సహకరిస్తాయి. నీ ఇష్టము, అయిష్టములను బట్టికాదు నీవు జీవించవలసింది. భగవంతుని వాక్యమును అనుసరించాలి. నీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా భగవంతుని వాక్యమును ప్రమాణముగా పెట్టుకొని జీవిస్తే నీవు పవిత్రుడవు అవుతావు. నీకు ఇష్టం లేకపోయినా భగవంతుడు అది మంచిపని అనిచెపితే నీవు చేయగలగాలి. భగవంతుడు చెప్పినట్లు వింటే నీవు బాగుపడతావుగాని నీ ఇష్టం మీద, అయిష్టంమీద నీవు బాగుపడటం ఆధారపడిలేదు. భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకొని జీవిస్తే జ్ఞానగంగ తప్పక నీచేతికి అందుతుంది.

మనకు అన్నింటికంటే మన అహంకారం అంటే ఇష్టం. మనమాట ద్వారా, మనచేతద్వారా అహంకారమును పెంచుకొంటున్నాము. దేనినైతే పోగొట్టుకోవాలో దైనందిన జీవితంలో దానినే పెంచుకొంటున్నాము, మోక్షంకావాలి అని భగవంతుడిని అడుగుతున్నాము ఇదిఎలాసాధ్యమవుతుంది. యదార్థంగా మనం భగవంతుడిని పూజించటంలేదు, మన అహంకారాన్నిపూజిస్తున్నాము. ఈ విషయం నీకు అర్ధమవ్వటం కోసం, నీకు తెలియజేయటం కోసం గురువు కొన్ని మాటలు మృదువుగాను, కొన్ని మాటలు తీవ్రంగాను చెపుతాడు. ధనకాంక్ష ఉన్నవాడు ధనం సంపాదించటంకోసం ఎంత కష్టపడుతూ ఉంటాడో, విద్యాకాంక్ష ఉన్నవాడు విద్యకోసం నిరంతరం ఎలా కృషి చేస్తాడో అలాగ నీకు మోక్షం కావాలంటే భక్తిని అభివృద్ధి చేసుకోవటానికి కృషి చేయాలి. నన్ను నేను రక్షించుకోలేను, నీ సహాయం లేకపోతే ఈ బంధాల నుండి బయటకు రాలేను అని నీకు తెలిసినప్పుడు భగవంతుడిని ప్రార్థించటం ప్రారంభిస్తావు. నాఅంతట నేను అజ్ఞానంనుండి బయటకు రాలేకపోతున్నాను నీ సహాయ సహకారములను అర్థిస్తున్నాను, నీ అనుగ్రహం లేకుండా

నేను ఒడ్డుకు రాలేను అని భగవంతుడిని వేడుకొంటావు. ఇలా ఈశ్వరుని యందు భక్తి పెరగగా, పెరగగా పరిపూర్ణమైన శరణాగతి కలిగినపుడు ఈశ్వరుడే నీకోసం మానవాకారం ధరించి గురువుగా వస్తాడు. ఆయనపట్ల నీకు ప్రేమగలిగేటట్లు ఆయనే చేసుకొంటాడు, నీకుబోధిస్తాడు. పూర్వజన్మలలో, ఈజన్మలో నీవు అనేక వంకరలు తిరిగి ఉండవచ్చు. నది ఎన్నివంకరలు తిరిగినా చివరకు సముద్రంలో ఎలా కలుస్తుందో అలాగ నీజీవితంలో ఎన్నివంకరలు ఉన్నా ఈశ్వరుడు గురువుగా వచ్చినప్పడు నీహృదయంలో ఉన్న సత్యవస్తువులో నిన్ను ఐక్యం చేస్తాడు. నీ పూజలకు, జపాలకు, ధ్యానాలకు, నీహృదయములో ఉన్న పవిత్రతకు కరిగిపోయి ఆయనకు ఆకారం అవసరం లేకపోయినా ఒక ఆకారం ధరించి, ఒక పేరుపెట్టుకొని గురువుగా నిన్ను సమీపిస్తాడు. ఏ వస్తువుకోసం నీవు వెతుకుచున్నావో ఆవస్తువు నీహృదయంలోనే ఉంది అనిబోధించి, నీ మనస్సును ఉపసంహరింప చేసి నీహృదయంలోనికి వెళ్ళే వరకు తరుముకుంటూ వెళతాడు. వాడే గురువు. ఈ శరీరంలో ఉండగా ఆయన ఇచ్చే శక్తి నీవు తట్టుకోలేకపోతే అవసరమైతే నాలుగుజన్మలు అయినా ఆగి నిన్ను వెంటాడి నీకు అర్హత, యోగ్యత కలుగజేసి ఆయన స్వరూపం నీకు ఇచ్చేవరకు నిన్నువదలడు. వాడే గురువు.